ప్రజాశక్తి
సోమవారం 17 జూన్ 2024   8 పేజీలు



గుంటూరు



పల్నాడు

బదిలీ భయం!

- రెండేళ్లు పూర్తయిన వారికి స్థానచలనం
- ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు అధికారుల ప్రయత్నం



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అధికారులకి బదిలీల భయం వెంటాడుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అన్ని శాఖల్లో బదిలీలు జరగనున్నాయి. గత ప్రభుత్వం హయాంలో నియమితులైన అధికారులు కొంత మంది ఏకపక్షంగా పనిచేశారని అధికార టిడిపి నేతలు గుర్రుగా ఉన్నారు. ఎక్కువ మంది జిల్లా అధికారులు 2022 ఏప్రిల్‌లో ఆయా శాఖల్లో నియమితులయ్యారు. 2022 ఏప్రిల్ 2న గుంటూరు కలెక్టర్‌గా ఎం.వేణుగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన రెండేళ్ల రెండు నెలలు జిల్లాలో పనిచేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఐఎఎస్ అధికారుల బదిలీల్లో వేణుగోపాల్‌రెడ్డికి కూడా బదిలీ కావచ్చని అధికారుల్లో చర్చ జరుగుతోంది. మూడేళ్ల క్రితమే జిల్లాకి వచ్చిన జాయింట్ కలెక్టర్ రాజ కుమారి బదిలీ జరగవచ్చని తెలిసింది. గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ చేకూరి కీర్తి కూడా రెండేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. గుంటూరు జిల్లా ఎస్.పి. తుషార్ దూడి ఎన్నికల ముందు తొలిసారిగా ఎస్‌పిగా జిల్లాకు వచ్చారు. ఆయన భాద్యతల స్వీకరించి నాలుగు నెలలు కావడంతో ఆయన బదిలీ జరగక పోవచ్చని చెబుతున్నారు. జిల్లాలో దాదాపు 70 శాఖల్లో రెండేళ్ల క్రితం జిల్లా అధికారులుగా బదిలీపై వచ్చారు. వీరిలో ఎక్కువ మంది బదిలీ అవుతారని తెలిసింది.

పల్నాడు జిల్లా 2022 ఏప్రిల్ 4న ఏర్పాటు చేశారు. దాదాపు 70 శాఖల అధికారులు రెండేళ్ల క్రితం పల్నాడు జిల్లాకి బదిలీ పై నియమితులయ్యారు. కొన్ని శాఖల్లో సీనియర్ అధికారులు లేకపోవడంతో ఆయా శాఖల్లోని ఇతర విభాగాల్లో పనిచేస్తున్న అధికారుల్ని జిల్లా అధికారులుగా నియమించారు. దీంతో ఆయా శాఖల పనితీరు, గత రెండేళ్లుగా మందగమనంగా సాగింది. పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లత్కర్ బాలాజీరావు, ఎస్‌పిగా మలికా గర్గ్ గత నెలలో జిల్లాకు రావడం వల్ల ఇప్పట్లో వారి బదిలీ ఉండక పోవచ్చని చెబుతున్నారు. కానీ జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి, వివిధ శాఖల అధికారులు త్వరలోనే బదిలీ అవుతారని ప్రచారమవుతోంది. పలువురు అధికారులు ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులుగా పనిచేస్తున్న సందర్భంలో కొందరి పనితీరుపై టిడిపి నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వీరందరిపై త్వరలో బదిలీ అయ్యే అవకాశం ఉంది. ప్రధానంగా బదిలీ తప్పని సరిగా జరుగుతుందని తెలిసిన అధికారులు ఇప్పటి నుంచే నూతన మంత్రుల్ని, వారి అనుచరుల్ని, ఎమ్మెల్యేలను ప్రసన్న చేసుకోవడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తెలిసింది.

పిన్నెల్లి సోదరులపై రౌడీషీట్?

ప్రజాశక్తి-మాచర్ల

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకటరామిరెడ్డి ప్రమేయంపై పలు కేసులు నమోదైన నేపథ్యంలో తాజాగా వారిపై రౌడీషీట్ తెరిచినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల హింస, ముఖ్యంగా పోలింగ్ రోజున రెంటచింతల మండలం పాల్వాయిగేటులో పోలింగ్ కేంద్రంలో ఈవీఎంల ధ్వంసంతో పాటు, టిడిపి ఏజెంట్ నంబూరు శేషగిరిరావుపై దాడి, ఒక మహిళను దుర్భాషలాడారని రామకృష్ణారెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఆయనతోపాటు ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ఎన్నికల మరుసటి రోజు కారంపూడిలో వందల సంఖ్యలో అల్లరి మూకలను వెంటబెట్టుకుని జనాలను భయభ్రాంతులకు గురిచేస్తూ టిడిపి శ్రేణులపై దాడులు చేశారని పిన్నెల్లి సోదరులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కారంపూడి సిఐ నారాయణస్వామిపై దాడి చేసి, గాయపరిచిన కేసులోనూ రామకృష్ణారెడ్డి నిందితుడిగా ఉన్నారు. ఇంకా పలు కేసులు పిన్నెల్లి బ్రదర్స్‌పై నమోదు కావటంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాజాగా మాచర్ల పోలీసులు రౌడీషీట్ తెరిచినట్లు సమాచారం. పోలింగ్ రోజు మాచర్ల పట్టణంలోని పీడబ్ల్యూడి కాలనీలో ఓ ఇంటిపై దాడిచేసి టిడిపి కార్యకర్తలను గాయపరిచిన కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, వైసిపి ప్రధాన నాయకులు బూడిద శ్రీను, మన్నయ్య మరికొంతమందికి జిల్లాకోర్టులో కండీషన్ బెయిల్ మంజూరైనట్లు తెలిసింది. వారి తరుపు లాయర్లు బెయిల్ పేపర్లు తీసుకొని మాచర్ల పోలీస్ స్టేషన్‌కు రాగా, కోర్టు నుంచి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం రానందున వారి సంతకాలు తీసుకునేందుకు స్థానిక అధికారులు నిరాకరించినట్లు తెలిసింది.



జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాను సత్కరిస్తున్న ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు

కొత్త సీసాలో పాత మందులా భారతీయ న్యాయ సంహిత

న్యాయవాదుల అవగాహన సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఏపీ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవాదుల అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. సదస్సుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ న్యాయ సంహిత ఐపిసి పీనల్ కోడ్‌ను పోలి ఉందని, కొత్త సీసాలో పాత మందు పోసిన సామెతను పోలి ఉందన్నారు. సైబర్ క్రైమ్ లింగ వివక్ష చట్టం, ఉగ్రవాద వ్యతిరేక చట్టాలు వంటి పలు రకాల సెక్షన్ల గురించి ఆయన వివరించారు. ఆధారాలను సేకరించడంలో న్యాయవాదులు ఓర్పు నేర్పు కలిగి ఉండాలన్నారు. ఆస్తి బదిలీ చట్టం, ఆస్తి హక్కు, నిర్దిష్ట ఉపశమన చట్టం, రిజిస్ట్రేషన్ చట్టం, మేధో సంపత్తి హక్కులు, ఎలక్ట్రానిక్ ఆధారాలు, రాజ్యాంగ లక్ష్యాలను సాధించడంలో న్యాయవాది పాత్ర, చలించని ఆస్తులు-డాక్యుమెంటేషన్ మొదలైన పలు రకాల అంశాల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి, కెఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.



పలుచోట్ల మోస్తరు వర్షం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, తాడికొండ, తుళ్లూరు, గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కొన్ని చోట్ల పిడుగులు పడ్డాయి.

పేదలపై ధరల దరువు

- పోషకాహారానికి దూరంగా సామాన్యులు
- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కూరగాయలు, మాంసం ధరలు
- భారీగా పెరుగుదలతో కొనుగోలుకే భయం



చిలకలూరిపేట పట్టణంలోని కూరగాయల మార్కెట్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అందరూ పౌష్టికాహారం తినడంతోపాటు బాలలు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందించాలనే ప్రచారం వివిధ రూపాల్లో తరచూ జరుగుతూ ఉంటుంది. అయితే మార్కెట్‌లో పరిస్థితి మాత్రం ప్రజలను పోషకాహారానికి దూరంగా నెట్టేస్తోంది. వెజ్ అని లేదు.. నాన్ వెజ్ అని లేదు.. దేని ధరలు చూసిన భయపెట్టే రీతిలో పెరిగాయి. కొన్నింటి ధరలు రెండింతలైతే మరికొన్నింటి ధరలు మూడింతలై వినియోగదార్లను భయపెడుతున్నాయి. ఇంత ధరపెట్టి కొనడం తమ వల్లకాదని రోజువారీ కూలి పనులు చేసుకునేవారు చేతులెత్తేస్తుంటే ఉద్యోగాలు చేసుకునే మధ్యతరగతి వారు సైతం కొన్ని సందర్భాల్లో తాము కొనాల్సినవి కుదించేసుకుంటున్నారు.

ప్రస్తుతం దాదాపు అన్ని కూరగాయల ▶ 2లో

పాలస్తీనాపై దాడులను తక్షణమే ఆపాలి

అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇజ్రాయిల్ మారణహోమం - సంఘీభావ సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

8 లో

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం



రోడ్డుపక్కన బండ్ల తొలగిపులో పోలీసులు

ఆత్మకూరు వద్ద ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

రోడ్డుకి ఇరువైపులా బండ్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని రూరల్ సిఐ జి.వెంకటరావు, ఎస్సై జె.క్రాంతి కిరణ్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం విజె జూనియర్ కళాశాల వద్ద, ఆత్మకూరు జంక్షన్ వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా రోడ్డుకిరువైపులు ఉన్న తోపుడు బండ్లు, టిఫిన్, కూరగాయలు, బండ్లు దూరంగా జరిపించారు. బండ్లు పెట్టడం వల్ల వాహనాలకు, కాలినడక వారికి, ఇబ్బందిగా ఉన్నందున రోడ్డుకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. విజె కళాశాల వద్ద తోపుడు బండ్లు, వాహనాలు నిలపవద్దని చెప్పారు. నిత్యం ఆత్మకూరు జంక్షన్ కు వచ్చే వాహనాలతో పాటు కాలినడకన వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా సహకరించాలని కోరారు.



భోజనాలు వడ్డి స్తున్న టిడిపి నాయకులు

ప్రాతూరులో టిడిపి విజయోత్సవాలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిన సందర్భంగా ఎమ్‌టిఎంసి పరిధిలోని ప్రాతూరులో ఆదివారం టిడిపి అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆత్మీయ విజయోత్సవం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 1500 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. తొలుత ఎన్‌టిఆర్ చిత్రపటానికి నాయకులు పూల మాలలేసి నివాళు లర్పించారు. టిడిపి గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, మండల తెలుగు మహిళా అధ్యక్షులు బొర్రా కృష్ణవందన, చిర్రావూరు గ్రామ టిడిపి అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, ఫ్రాన్సిస్, పి.రాజేష్ పాల్గొన్నారు.



వెంకట్రావును సత్కరిస్తున్న సుందరరావు యాదవ్ తదితరులు

వెంకట్రావుకు సత్కారం

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలో లోకేష్ భారీ మెజార్టీతో గెలుపొందడానికి తాడేపల్లి పట్టణంలో 11,300 మెజార్టీ తీసుకురావడానికి పట్టణాధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు కృషి చేశారని టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్ అభినందించారు. ఆ మేరకు ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో వెంట్రావును సత్కరించారు. రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని, సుపరిపాలన అందిస్తామని నాయకులు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, ఎ.మురళీ, కె.విజయ్, డి.శ్రీనివాసరెడ్డి, భాస్కర్, చంద్రమౌలి పాల్గొన్నారు.



చిలకలూరిపేట పట్టణంలో చేపలు విక్రయించే ప్రాంతం

పేదలపై ధరల దరువు

(మొదటి పేజీ తరువాయి)

ధరలు కిలో రూ.80 వరకు పలుకుతున్నాయి. 15 రోజుల వ్యవధిలో ఉల్లిపాయలు, టమాట, ఇతర కూరగాయల ధరలు 60 శాతం పెరగడం పరిస్థితి తీవ్రతకు నిదర్శన. మే నెల 3వ వారంలో రూ.20 ఉన్న ఉల్లి ప్రస్తుతం రూ.50కు చేరింది. టమాట రూ.60కుపైగానే, క్యారెట్, వంకాయలు, బీన్స్, బీరకాయలు రూ.70-80 మధ్య ధరలున్నాయి. ఆకు కూరలను గతంలో రూ.10కి 3 కట్టలు ఇవ్వగా ఇప్పుడు రూ.15కు 2 కట్టలే ఇస్తున్నారు.


చిలకలూరిపేటలకు కూరగాయలను బాపట్ల జిల్లా మార్టూరు నుండి హోల్‌సేల్‌గా తెచ్చి స్థానికంగా హోల్‌సేల్‌గా, రిటైల్‌గానూ విక్రయిస్తుంటారు. ఆకు కూరలను మండలంలోని మురికిపూడి, బాపట్ల జిల్లా చీరాల నుండి తెచ్చి అమ్ముతుంటారు. పంట ఉత్పత్తి తగ్గడం, రవాణా ఛార్జీలు పెరగడం వల్ల ధరలు పెంచినట్లు అక్కడివారు చెబుతున్నారని, ఈ ధరల వల్ల తాము బేరాలను చాలా వరకు కోల్పోతున్నామని స్థానిక విక్రేతలు వాపోతున్నారు.

ఇదిలా ఉండగా మాంసం ధరలు సైతం సామాన్యులు కొనలేని స్థాయిలో పెరిగాయి. చికెన్ కిలో 320, మటన్ రూ.900 ఉండగా బీఫ్ గతంలో రూ.300 విక్రయించేవారు ఇప్పుడు రూ.500కు పెంచారు. గాడిద మాంసం అయితే రూ.300 నుండి రూ.800కుపైగానే పెరిగింది. చేపలు కిలో రూ.800-900 వరకు ఉన్నాయి. వాటిని శుభ్రం చేశాక తూకం వేస్తే పావుకిలోకుపైగానే తగ్గుతోంది. ఈ లెక్కన అచ్చంగా కిలో చేపల ధర రూ.వెయ్యి నుండి రూ.1200 వరకు అవుతోంది. ఇవన్నీ ఒకెత్తయితే తానేమీ తగ్గనన్నట్లు కోడిగుడ్ల ధరలు సైతం ఎగురుతున్నాయి. ఒక గుడ్డును రూ.ఆరున్నర నుండి రూ.7 వరకూ అమ్ముతున్నారు. పెద్ద మాల్స్‌లో అయితే రూ.10 వసూలు చేస్తుండగా నాటు కోడిగుడ్లను మాత్రం ఒక్కోగుడ్డును రూ.20-30 వరకూ అమ్ముతున్నారు. అయితే ఈ ధరలను బోర్డులపై రాయడం లేదు.


కోళ్ల ఉత్పత్తి తగ్గిన కారణంగా ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. చేపటలను గతంలో మండలంలోని పలు గ్రామాల్లోని చెరువుల్లో పెంచి వాటిని అమ్మేవారు. దీంతోపాటు ప్రత్యేకంగా కొన్ని చేపల చెరువులు ఉండేవి. అయితే ఇప్పుడు చెరువులు తగ్గిన కారణంగా విజయవాడ నుండి తాము చేపలను తేవాల్సి వస్తోందని, తమకు గిట్టుబాటు అవ్వాలంటే ధర పెంచక తప్పదని స్థానిక విక్రేతలు చెబుతున్నారు. మరోవైపు ఇంత ధర ఎందుకని సామాన్యులు ఆలోచించేలోపే ధనవంతులు ధరతో నిమిత్తం లేకుండా కొనేస్తున్నారని, కొందరు వినియోగదారులు తమ అనుభవాలను చెబుతున్నారు. ఇదిలా ఉండగా బీఫ్, గాడిద మాంసం తినేవారి సంఖ్య పెరిగిన కారణంగా వాటికీ డిమాండ్ పెరిగి ధరలను పెంచారని కొంతరు వినియోగదారులు అభిప్రాయ పడుతున్నారు. మొత్తంగా పెరిగిన ధరలు పేదలు, కూలీలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే మధ్యతరగతిని ఆయో మయంలో పడేస్తున్నాయి. ధరల నియంత్రణపై ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటేనే ప్రజలంతా పౌష్టికాహారం తీసుకోగలరని, లేకుంటే అరకొర భోజనాలతో సరిపెట్టుకోవాల్సిందేనని సామాన్యులు నిట్టూరుస్తున్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త కొసరాజు కన్నుమూత

ప్రజాశక్తి -పొన్నూరు



పొన్నూరు రోటరీ క్లబ్ స్థల దాత, ప్రముఖ వ్యాపారవేత్త, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు కొసరాజు సత్యనారాయణ (82) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాయి సేవా సమితి అధ్యక్షునిగా ఆయన వ్యవహరించారు. నిర్మాణంలో ఉన్న రోటరీ క్లబ్ నూతన భవనానికి రూ.లక్షల విలువచేసే స్థలాన్ని ఉచితంగా అందజేయడం తోపాటు భవన నిర్మాణానికి సైతం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కొసరాజు సత్యనారాయణ భౌతికకాయాన్ని పొన్నూరు, బాపట్ల ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, వేగేశన నరేంద్రవర్మ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. రైతు కుటుంబంలో జన్మించిన కొసరాజు సత్యనారాయణ 60 ఏళ్లుగా వ్యాపార రంగంలో పేరు ప్రఖ్యాతులు గడించారు. అంతిమయాత్ర సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆయన అల్లుళ్లు శ్రీనివాసరావు, అశోక్ కుమార్ తెలిపారు. నివాళులర్పించిన వారిలో రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసరావు, సెక్రటరీ బోడపాటి రామారావు, వేదా స్కూల్ డైరెక్టర్ అంబటి వెంకటేశ్వరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి బిబి చౌదరి, సభ్యులు ఎన్.మేఘనాథ్, కె.రామకృష్ణ, తోట భాను, డాక్టర్ రవి, రాకేష్ దేవ్, పాములపాటి రవీంద్రనాథ్, ఎంఎం ఖుద్దూస్, రెటీనా వీరయ్య, మహమ్మద్ జిలాని, ఎన్ బాలకృష్ణ, జి.రాధాకృష్ణ, కె.రామచంద్రరావు, జాగర్లమూడి సుధీర్, సాయికృష్ణ, ఆరే వరప్రసాద్, పి.లక్ష్మీనారాయణ చౌదరి, ఇతర ప్రముఖులున్నారు.



స్పెషల్ డ్రైవ్‌గా తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత పనులు

ప్రజాశక్తి - చేబ్రోలు

గ్రామాల్లో ప్రజలకు రక్షిత నీటి సరఫరాతో పాటు తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను (ఓహెచ్ఆర్ఎస్) ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఇఒపిఆర్‌డి జి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ శ్రీనివాసరావు చెప్పారు. సాధరణంగా ప్రతి 15 రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేస్తారని, అయితే సీజన్ మారే



సమయాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్తలో భాగంగా మండలంలోని అన్ని తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ, డిపిఒ ఇచ్చిన ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. చేబ్రోలు, నారాకోడూరు, వేజెండ్ల మేజర్ పంచాయతీలో ఓవర్ హెడ్ ట్యాంకులను ఆదివారం నాటికి శుభ్రపరచడం పూర్తయిందని వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ట్యాంకులను పరిశుభ్రం చేయడానికి ఈనెల 12 నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టామని, 19వ తేదీ వరకు నిర్ణయించిన షెడ్యూల్డ్ ప్రకారం అన్ని గ్రామాల్లోనూ పనులు చేస్తామని చెప్పారు.

లోకేష్‌ను కలిసిన డీలర్ల సంఘం కార్యదర్శి


ప్రజాశక్తి-తాడేపల్లి

మంత్రి నారా లోకేష్‌ను ఆదివారం రాష్ట్ర డీలర్ల సంఘం కార్యదర్శి డి.బ్రహ్మానందరావు ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు బ్రహ్మానందరావు చెప్పారు.

ఘనంగా సాయిమందిర్ రజతోత్సవాలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

స్థానిక సాయి మందిర్ రజతోత్సవాలను ఆదివారం నిర్వహించారు. కమిటీ చైర్మన్ శ్రీరామ్మోహన్‌రావు, అధ్యక్షులు డిఎల్ఎస్ఆర్ ప్రసాద్, అరవపల్లి రామ సుబ్బారావు ప్రత్యేక కార్యక్రమాలు చేశారు. 44 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాల్లో పారిశ్రామికవేత్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



రోడ్డు ప్రమాదంలో బస్సు క్లీనర్ మృతి

- ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు
- బాపట్ల నుంచి హైదరాబాద్ వెళ్తుండగా కంటెపూడి సమీపంలో ఘటన
- ఆరుగురు ప్రయాణికులకు గాయాలు




మృతుడు తిమ్మిశెట్టి మణికంఠ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టిన సంఘటన పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి మండలం కంటిపూడి సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో నరసరావుపేట మండలం కాకానికి చెందిన బస్సు క్లీనర్ తిమ్మిశెట్టి మణికంఠ (24) మతి చెందగా, ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల నుంచి 30 మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళతున్న మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కంటిపూడి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ తో పాటు మరో 6 ప్రయాణికులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన క్లీనర్‌ను 108 వాహ నం ద్వారా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మతి చెందాడు. బాపట్లకు చెందిన కె. చంద్ర శేఖర్, అతని భార్య లక్ష్మి , లక్ష్మి సుధా, పత్తిపాడుకు చెందిన వై.ప్రసాద్ రెడ్డి, గార్ల పాడుకు చెందిన రత్తయ్య, పెదనంది పాడు కు చెందిన మాధవి గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్లీనర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు. మతుడు తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ ఎఎస్ఐ కరిముల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు . ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ఈదర రమేష్ బాబును అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు. లారీ డ్రైవర్, క్లీనరు పరారీలో ఉన్నారు.


టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

పేదల పెద్దకొడుకు చంద్రబాబు : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఇంటి పెద్దకొడుకుగా చంద్రబాబు నాయుడు నిలిచిపోయారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. సామాజిక పింఛన్ల పెంపును హర్షిస్తూ ఎమ్మెల్యే మాధవి ఆధ్వర్యంలో పెన్షన్ దారులతో కలిసి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఆదివారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అందించే సామాజిక పింఛను మొత్తం రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచారని, వచ్చే నెల ఒకటో తేదీన పెంచిన సొమ్ము నాలుగు వేలు ఇస్తారని చెప్పారు. చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు రూ.రెండు వేలు ఉన్న పింఛన్ జగన్ హయాంలో రూ.మూడు వేలకు చేరుకునేందుకు ఐదేళ్లు పట్టిందని ఎద్దేవా చేశారు.

కెఎల్‌యులో ఏక్ భారత్ శ్రేష్ట భారత్ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్


సదస్సులో ప్రసంగిస్తున్న క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్

ఇబిఎస్‌బి-2లో భాగంగా కెఎల్ యూనివర్సిటీలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ శిబిరాన్ని ఆదివారం ప్రారంభిం చారు. ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌లో ఈ నెల 15 నుంచి 26 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమానికి విశాఖపట్నం, కాకినాడ, కర్నూలు, తిరుపతి గ్రూపులు, రాజస్థాన్ డైరెక్టరేట్‌లోని జోధ్‌పూర్, ఉదయ్‌పూర్ గ్రూపులకు చెందిన క్యాడె ట్‌లతో పాటు ఎ.పి, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్‌ల నుండి మొత్తం 593 క్యాడెట్‌లు హాజరయ్యారు. ఈ శిబిరాన్ని ఎం.పి, తెలంగాణా ఎన్‌సిసి డైరెక్టరేట్‌కు చెందిన గుంటూరు గ్రూప్ నిర్వహిస్తోందని కెఎల్ యుఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని తెలిపారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్, రాజస్థాన్‌లోని గొప్ప సంప్ర దాయాలు, ఆచారాల గురించి వివ రించారు. క్యాడెట్‌లందరికీ వివిధ పోటీలను నిర్వ హించారు. ఎన్‌సిసి కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొ నాలని, ఒకరితో ఒకరు సాంస్కృతిక మార్పిడిలో పాల్గొ నాలని ప్రోత్సహించారు. సాం స్కృతిక, విద్య, సామాజిక అనుభవాల మార్పిడి ద్వారా వివిధ రాష్ట్రాల ప్రజల మధ్య పరస్పర అవగాహన, బంధాన్ని ప్రోత్సహించడం శిబిరం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సిఎస్ సిద్ధు, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌విఎస్ సుదర్శన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆళ్ల హరి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం కృషి చేస్తూ ప్రజల అండగా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి నిలిచారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. ఆళ్ల హరి పుట్టినరోజు సందర్భంగా నగరంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టాభిపురం చిల్డ్రన్స్ ఆశ్రమంలో, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. పలు ప్రాంతాల్లో కేక్ కట్ చేశారు. శ్రీనివాసరావుతోటలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ రాజకీయంగా ఆయనకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు కోవెలమూడి నాని, జనసేన నాయకులు సయ్యద్ షర్ఫుద్దీన్, గడ్డం రోశయ్య, సయ్యద్ చాంద్, నాజర్ వలి, సాయి, సోమి ఉదయ్, నాని తదితరులు పాల్గొన్నారు.

అవసరానికని ఫోన్ ఇచ్చారో... అంతేసంగతులు...

- మంగళగిరిలో సెల్ ఫోన్ దొంగల హల్ చల్
- మాయమవుతున్న ఫోన్లు... నామమాత్రంగా రికవరీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

అత్యవసరం అంటూ అగంతుకులు మీ దగ్గరకు వచ్చి ఫోన్ కాల్ చేసుకునేందుకు మీ మొబైల్ అడిగితే ఇచ్చారంటే ఇక మీ ఫోన్ గోవిందా నే... ఫోన్ చేసుకున్నట్లు నటించి ఫోన్ తీసుకొని పలాయనం చిత్తగించిన సంఘటన మంగళగిరి మండలం కాజా గ్రామంలో చోటు చేసుకుంది. ఫోన్ ఇతరులకు ఇచ్చి ఆదమరిచారో.. అడ్రస్ గల్లంతు సహాయానికి పోయి చేతులు కాల్చుకోవడమే..

మంగళగిరి పరిసర ప్రాంతాలలో సెల్ ఫోన్ కొట్టివేసే దొంగల ముఠా హల్ చల్ చేస్తున్నారు. ఈ దొంగల ముఠా మంగళగిరి ప్రాంతంలో తిష్ట వేసి దొంగతనాలకు పాల్పడు తున్నారు. కాజ టోల్గేట్ కేంద్రంగా ఈ దొంగల ముఠా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. తాజాగా కాజా గ్రామానికి చెందిన శాంసన్ అనే యువకుడు గ్రామంలో ఓ షాపు వద్ద ఉండగా అక్కడకు ఓ గుర్తు తెలి యని వ్యక్తి వచ్చి అర్జెంటుగా ఒకరికి ఫోన్ కాల్ చేయా లంటూ తన మొబైల్ ఇవ్వాలని శాంసన్ అనే యువకుడిని కోరాడు. అత్యవసరమనీ చెప్పడంతో తన మొబైల్ ఫోన్ చేసుకునేందుకు ఆ వ్యక్తికి ఇచ్చాడు. ఆ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ కాల్ చేస్తున్నట్లు నటించి తనతో పాటు వచ్చిన మరో ఇద్దరు వ్యక్తులకు బైక్ స్టార్ట్ చేయాలంటూ సైగలు చేశాడు. తోటి వ్యక్తులు బైక్ స్టార్ట్ చేసి రెడీగా ఉండగా ఫోన్ చేసుకున్నట్లు నటించిన ఆ వ్యక్తి ఫోన్ తీసుకొని బైక్ ఎక్కి పారిపోయాడు. ఇదంతా క్షణాల్లోనే జరిగిపోయింది.. ముగ్గురు వ్యక్తులు ఒకే స్కూటి పై పరారయ్యారు. కాజ నుండి టోల్గేట్ వైపు వెళ్ళిపోయారు. దొంగలించిన ఫోన్‌ను సైతం స్విచ్ ఆఫ్ చేశారు. వారి వెంటే బాధితుడు వెంబ డించి స్థానికుల సహకారంతో కాజ టోల్ ప్లాజా వద్ద బైకును అడ్డగించి ఆ ముగ్గురు వ్యక్తులను నిలుపుదల చేశారు. టోల్గేట్ సమీపంలో ఉన్న రక్షక పోలీసులకు సమా చారం అందించి ఆ ముగ్గురు దొంగలను పట్టించారు.

ఇది ఇలా ఉంటే గత కొద్ది రోజుల క్రితం ఆత్మకూరు బైపాస్ వద్ద ఓ షాపులో సిగరెట్లు కొనుగోలు చేసేందుకు ప్రసాద్ అనే వ్యక్తి వెళ్లగా అతని వెనుక ఓ గుర్తు తెలియని వ్యక్తి 30 రూపాయలను కిందపడేసి మీ డబ్బులు కింద పడిపోయా అంటూ అతనిని పక్కదారి పట్టించి క్రింద పడిన డబ్బులు తీసుకునే క్రమంలో ప్రసాద్ జేబులోని సెల్ ఫోన్ మాయం చేసి పరార్ అయ్యాడు. ఆత్మకూరు గ్రామా నికి చెందిన మరో వ్యక్తి గత కొన్ని నెలల క్రితం తన కుమారుడిని బైక్‌పై ఎక్కించుకొని వెళ్తుండగా కుమారుడు చేతిలో ఫోన్ పెట్టుకొని రీల్స్ చూస్తుండగా వెనక నుండి వారిని అనుసరిస్తూ వచ్చిన ఇద్దరు దొంగలు ముఠా ఫోన్ లాక్కొని స్పీడ్ గా పరారయ్యారు. కొద్ది రోజుల క్రితం కాజా టోల్ ప్లాజా వద్ద రాత్రిపూట సమయంలో అటుగా వస్తున్న లారీలు రోడ్డు పక్కన నిలుపుదల చేసి డ్రైవర్లు నిద్రిస్తున్న సమయంలో ఫోన్లు కాజేస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. మంగళగిరి టిప్పర్ల బజార్లో ఓ కొత్త పల్సర్ బైక్ కూడా మాయమైంది.

మంగళగిరి రూరల్ ప్రాంతంలో సెల్ ఫోన్, బైక్ దొంగలు ఈ విధంగా హల్చల్ సష్టిస్తున్నారు పోలీసుల పెట్టిన నిఘా పనిచేయని పరిస్థితి ఏర్పడింది. గత మూడు నెలల కాలంలో వందలాది ఫోన్లు చోరీలకు గురి అయ్యాయి. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెంచి స్థానికులు అప్పగించిన దొంగల వివరాలను వెల్లడించి వారిని పూర్తిస్థాయిలో విచారించి గత దొంగతనాలకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. వారి వద్ద నుండి ఆయా ఫోన్లను రికవరీ చేయాలని, వాటిని బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు. ఫోన్లను పార్ట్ ల వారిగా విడదీసి సొమ్ము చేసుకుంటున్నారు అంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో వాటిపై కూడా నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కొండ్రముట్ల ఆర్‌బికెలో చోరీ

ప్రజాశక్తి-ఈపూరు


పగిలిన తలుపు తాళాలు పరిశీలిస్తున్న పోలీసులు

మండలంలోని కొండ్రముట్ల ఆర్‌బికెలో గుర్తుతెలియని దుండ గులు తలుపు తాళాలు పగల గొట్టి పరికరాలను చోరీ చేసినట్లు ఏవో ఆర్ రామారావు తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయ కులు ఎం శ్రీవిద్య ఈ నెల 15వ తేదీన విధులు ముగిం చుకొని కార్యా లయానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లారని అదే రోజు రాత్రి తాళాలు పగలగొట్టి గదిలోని ఎల్ఈడి టీవీ, హెచ్పీ కంపెనీ కంప్యూటర్, ప్రింటర్ పరికరాలు, స్టెబిలైజర్ చోరీ చేశారన్నారు.ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఆర్బీకేను సందర్శించి చోరీ తీరును పరిశీలించారు.ఇదే ఆర్బికే లో గతంలో తలుపు తాళాలు పగలగొట్టి వస్తువులను చిందరవందరగా పడేశారు. ప్రతిరోజు కొందరు ఆకతాయిలు ఆర్బికె ఆవరణలో మద్యం సేవిస్తూ మద్యం సీసాలను అక్కడే పడేసి వెళ్తున్నారని కార్యాలయానికి వెళ్లిన ఉద్యోగులకు మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయని చాలా ఇబ్బందికరంగా ఉందని పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన గ్రామస్తులు

ప్రజాశక్తి-నూజెండ్ల

మండలంలోని ఐనవోలు గ్రామస్థులు దొంగలను పట్టుకుని పోలీ సులకు అప్ప గిం చారు. గ్రామానికి చెం దిన పూర్ణ చంద్రా రావు రోడ్డుపై గల తన షాపును మూసివేసి ఇంటికి వెళ్ళాడు. అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో సుత్తులతో తాళాలు పగలగొడుతున్న శబ్ధం రావడంతో సమీపంలోని వారు వెళ్లగా ఒక దొంగ పరార్ అయ్యాడు. ముగ్గురు దొంగలను గ్రామస్థులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్లో అప్పగించారు.



వైసిపి కార్యకర్తలపై దాడులు చేస్తే చెప్పండి

ప్రజాశక్తి - తాడేపల్లి

గెలుపోటములు సహజమని, వైసిపి కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ ఎమ్‌టిఎమ్‌సి అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. ఎన్నికల్లో గెలిచిన ఆనందంలో కొంతమంది ఎన్నడూ లేనివిధంగా దాడులకు పాల్పడుతూ విష సంస్కృతిని అలవాటు చేస్తున్నారని, ఈ రోజు ఓడిన వారే రేపు గెలుస్తారని అన్నారు. పట్టణ వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ జెసిఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు అధ్యక్షతన వైసిపి విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. వేమారెడ్డితోపాటు వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ఎక్కడ ఓడినా మంగళగిరి నియోజకవర్గంలో గెలిచే వాళ్లమని, మెజార్టీ వచ్చే తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో కూడా మెజార్టీని కోల్పోయామని అన్నారు. దీన్ని అదునుగా చూసుకుని వైసిపి కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని, వాటిని సహించబోమని అన్నారు. గతంలో ఎన్నో పార్టీలు ఓటమిని చవిచూసినా మళ్లీ ఊహించని విధంగా మెజార్టీలు సాధించాయని చెప్పారు. వైసిపి కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే నాయకులకు తెల పాలన్నారు. సమావేశంలో నాయకులు ఎం.వివేకానంద రెడ్డి, డి.రామకృష్ణారెడ్డి, ఎం.సాంబశివరావు, ఎం.రాంబాబు, జి.శ్రీని వాసరావు, కె.అరవిందారెడ్డి, ఎమ్‌డి గోరె, ఎం.అబ్బు, ఎ.సంపూర్ణ పార్వతి పాల్గొన్నారు.




మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి - నరసరావుపేట

దశాబ్దాల తర్వాత నరసరావుపేటలో టిడిపి జెండా ఎగరేసిన నేపథ్యంలో ఇస్సపాలెం మహంకాళి అమ్మవారికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అరవిందబాబు మాట్లాడుతూ దేవుని దయ,ప్రజల ఆశీర్వాదం ఫలితం గానే ఈ స్థాయి గెలుపు సాధ్యమైందన్నారు.ప్రజలకు మేలు చేసే, ప్రజల కోసం పని చేసే భాగ్యం కల్పించినందుకు తన మొక్కు తీర్చుకుంటున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా తనకు వచ్చిన అవకాశాన్ని ప్రజా సేవకు మాత్రమే ఉపయోగిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల

ప్రజాశక్తి-ఈపూరు



గ్రామస్తులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

మండలంలోని అంగలూరు గ్రామంలో శ్రీ నిదానం పాటి శ్రీ లక్ష్మీ అమ్మ వారి తిరుణాల ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు. ఆలయం వద్ద గ్రామస్తులు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామ స్తులు నిర్మించిన భారీ విద్యుత్ ప్రభ వాటిపై సాం స్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి.

నేడు శాంతి కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలోని వడ్డెర బజారులోని శ్రీలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి స్వామి, గోదాదేవి అమ్మవార్ల ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ విష యాన్ని దేవాలయ కమిటీ అధ్యక్షులు ఉప్పుతోళ్ల గోవిందరాజులు ఆదివారం తెలిపారు. అర్చకులు శ్రీమాన్ చలమాచలం భరద్వాజాచార్యులు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు శాంతి కళ్యాణ మహోత్సవం వేడుకలు జరుగుతాయని అన్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమాన్ని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ఆదివారం జరిగిన కార్యాక్రమాల్లో దేవాలయ కమిటీ సభ్యులు ఓరుగగంటి చెన్నకేశవరావు, ఉప్పుతోళ్ల ఏడుకొండలు, కొమర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌షిప్‌ల కోసం తీవ్ర పోటీ ?

ప్రజాశక్తి - రెంటచింతల

ఐదేళ్ల నుంచి అన్ని విధాల నష్టపోయిన టిడిపి శ్రేణులు రేషన్ డీలర్ షిప్ ను దక్కించుకోవడానికి పోటీ పడుతున్నారు మండల వ్యాప్తంగా 33 మంది రేషన్ డీలర్లు ఉన్నారు ఎవరికి వారు తమకి ఇవ్వాలంటే తమకు ఇవ్వాలని నేతల మీద ఒత్తిడి చేస్తున్నారు రేషన్ డీలర్ షిప్ ఆశించే వాళ్లలో చాలామంది వైసీపీ ప్రభుత్వ హయాంలో టిడిపి కోసం కష్టపడ్డ వాళ్లకి ఇవ్వాలని నిర్ణయించింది. మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన వారి సమాచారాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సేకరించారు.

పని కోసం నిరీక్షణ.. నిలబడ్డమే పెద్ద పరీక్ష..

- పనుల కోసం వేచి చూసే క్రమలో భవన నిర్మాణ కార్మికులు, హమాలీల ఇబ్బందులు
- రోడ్ల పక్కన, ఫుట్ పాత్‌లు, డివైడర్ల మీద, షాపుల ఎదుట నిరీక్షించాల్సిన దుస్థితి



గాంధీ పార్క్ వద్ద రోజువారి పనుల కోసం వేచిచూస్తున్న కూలీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రోజు వారీ కూలీ పనుల కోసం నిలబడేందుకు శాశ్వత జాగా లేక భవన నిర్మాణ, ఇతర ముఠా పనివాళ్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పనుల కోసం ఎదురు చూసే వీళ్లు రోడ్ల ప్రక్కన, ఫుట్ పాత్‌లపై, డివైడర్ల పై, షాపుల ముందు నిలబడాల్సి వస్తోంది. ఇలా నిలబడేందుకు వీరికి ప్రత్యేకంగా ఎటువంటి స్థలం లేదు. కొన్ని ఏళ్లుగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

కనీసం స్థలం కానీ, ఫలానా చోటు అని వారలు ఉంటరనే కేరా ఫ్ అడ్రస్ కానీ లేక ఉదయం ఉదయం సమయంలో సుమారు 8 గంటల నుండి 8.30 గంటలు దాటితే పనుల కోసం ఇక్కడే నిలబడేందుకు అవకాశం ఉండదు. ఎందుకంటే, దుకాణాలు తెరవడం, వాహనాల రద్దీ పెరుగుతుంది. దీంతో, ఆయా చోట్ల నిలబడి పనుల కోసం ఎదురు చూసే అవకాశం లేకుండా పోతోంది. పని దొరుకుతుందా లేదా అనేది కూడా చెప్పలేని పరిస్థితి. ప్రస్తు తానికి గాంధీపార్క్ కు ఎదురుగా ఉన్న రెండు బజార్లలో సుమారు మేస్త్రీ లు, కూలి పనివాళ్లుకలిపి 500 నుంచి 600 మంది వరకు ఇక్కడ నిలబడతారు.

ఎన్నార్టీ సెంటర్లో అయితే సుమారు 200 నుంచి 300 మంది, గడియార స్తంభం వద్ద 100 నుంచి120 మంది కూలీలు నిలబడతుంటారు. పనుల కోసం ఈ మూడు చోట్ల ఉదయం 7.30 గంటల నుంచి సుమారు 8.30 గంటల వరకు వారు నిలబడుతుంటారు. పట్టణంలోనే కాక పల్లెల నుంచి నిత్యం వందల మంది కార్మికులు పనుల కోసం పేటకు వస్తుంటారు. చిలకలూరిపేట పట్టణంలోని మూడు సెంటర్లలోనూ రోజు వారీ కూలీలు నిలబడేందుకు శాశ్వత జాగా లేని పరిస్థితి. ఫలానా చోటు లేదా కేరాఫ్ అడ్రస్ కానీ ఉంటే ఒక గంట ఆలస్యమైనా వారికి ఏదో ఒక పని దొరికే అవకాశం ఉంటుంది.

పట్టణంలోని గాంధీ పార్కులో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 వరకు ఉండేలా ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని భవన నిర్మాణ, ఇతర ముఠా పనివాళ్లు అభిప్రాయపడు తున్నారు.రోడ్ల పక్కన నిలబడటం వల్ల ప్రమా దాలు జరిగే అవకాశం లేకపోలేదని, దుకా ణాలు ముందు నిలబడటం తమకు అసౌకర్యంగా ఉంటోందని, ట్రాఫిక్ పోలీ సులు తమను నిలబడనివ్వటం లేదని వారు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం, చలికాలంలో చాలా ఇబ్బందులు పడుతున్న మంటున్నారు. ఈ విషయమై ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి తమకు కేరాఫ్ అడ్రసు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సేల్స్‌మన్‌గా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు!

- టార్గెట్ విద్యార్థులను చేర్పిస్తేనే వేతనాలు ఇస్తామంటున్న యాజమాన్యాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

అసలే చాలీచాలని వేతనాలు, ఆపై ఎన్నో కోతలు .. ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుల పరిస్థితి ఇది. తల్లిదండ్రుల తర్వాత గురువును దైవంగా భావించే మన సమాజం నేడు ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కేవలం ఒక నౌకర్లుగా మాత్రమే చూస్తున్నారు. కొన్ని కొన్ని పాఠశాలల్లో సగటున వేతనం రూ. 10,000 నుంచి రూ.12,000 మాత్రమే ఇస్తున్నారని, మహిళలకు కేవలం రూ.6000 నుంచి రూ. 8000 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పట్టణాల్లో అధిక ధరలు, అధిక ఇంటి అద్దెలు కట్టాలంటే ఈ వేతనాలు సరిపోవడం లేదని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాల యాజమాన్యం చెప్పినంత మంది విద్యార్థులను ప్రవేశాలు చేయించకపోతే వేతనాలు ఇవ్వమని, కొన్ని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి. దీంతో సకాలంలో వేతనాలు అందక, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ఏదో విధంగా వారికి కేటాయించిన టార్గెట్ విద్యార్థులను చేర్పించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. లేదంటే జీతం ఇవ్వమని బెదిరిస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఎలాగైనాసరే కొత్త విద్యార్థులను ఆయా పాఠ శాలల్లో చేర్పించే నిమిత్తం తమ పాఠశాలల్లో ఉన్నా లేని సౌకర్యాల గురించి చెప్పాలని తమపై యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని, తప్పని పరిస్థితులలో ఇష్టమున్నా ఆవిధంగా చేయడం తప్పటం లేదని కొంతమంది ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఉపా ధ్యాయులంటే సమాజంలో గౌరవం లేదని, సేల్స్ మెన్ లాగా ప్రతి ఇంటికి తిరిగి విద్యారులను చేర్పించాల్సిన పరిస్థితి ఏర్ప డడంతో ఇలాంటి ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులంటే చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు చెప్తున్నారు. ఉపాధ్యాయులకు గౌరవం రావాలంటే ప్రభుత్వ ఉద్యోగాలు ఎక్కువగా కల్పించడం, ప్రభుత్వ అధికారులు ప్రైవేటు పాఠశాలలను పర్యవేక్షిస్తూ ఉపాధ్యాయులకు సరిపడా వేతనాలు అందే విధంగా చూడాలని కోరుతున్నారు.

పర్వదినాలన్నీ పేదలతో ముడిపడి ఉన్నవే : పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇస్లాంలో ఉన్న పర్వదినాలన్నీ పేదవారితో ముడిపడి ఉన్నవేనని చిలక లూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక పండరీపురంలోని తన నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ బక్రీద్ పర్వదినం గురించి వివరించి చెప్పారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పారు. బలవంతులు బలహీనులను పశువుల్లా కొని తమ మొక్కుల కోసం బలిచ్చే వారని ఈ దురాచార నిర్మూలన బక్రీద్ లక్ష్యాలలో ప్రధానమైందన్నారు. ఖుర్బానీ ప్రధాన ఉద్దేశం బలి కాదని ,పేదల ఆకలి తీర్చడం, వారికి పౌష్టికాహారం అందించడమేనని అన్నారు. సకల బలహీనతలను జయించి ప్రజా చైతన్యాన్ని నిర్మించిన గొప్ప విప్లవ ప్రవక్త ఇబ్రహీం అలైహిస్సలాం అన్నారు. ఇస్లాం అనేది ప్రపంచంలోని అన్ని జాతులకు సంబంధిం చిన మార్గమన్నారు.

ప్రజలకు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినం అని మాచర్ల నియోజకవర్గం శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఖురాన్ సూక్తులను ఆచరించాలని ఆయన సూచించారు.

రోడ్డే... ఆవుల అడ్డా!

- నరసరావుపేటలో ట్రాఫిక్ సమస్య
- వాహనదారులకు ఇబ్బందిగా ఆవులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రంగా ఏర్పడిన నరసరావుపేట పట్టణంలో గతంతో పోలిస్తే ట్రాఫిక్ సమస్య బాగా పెరిగి పోయింది. దీంతో వాహన దారులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇవి చాలదన్నట్లు పలువురు ఆల యాలకు ఇచ్చిన ఆవులతో, కొందరు పెంచుకునే ఆవులు రోడ్డు మీదకు వదలడంతో ఆవులు రోడ్డుపై సంచరిం చడం, రోడ్డుకు అడ్డంగా పడుకోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారింది. మేత కొరత పెరిగిన దాణా ఖర్చుతో ఆవులను పోషించలేక ఇలా రోడ్ల పైకి వదులు తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దుకాణాల వద్దకు ఆవులు వెళ్లడం దుకాణదారులు కాయలు, తౌడు పెట్టి పక్కకు తోలుతుండటం పరిపాటైంది. ఆహారం కోసం అవి మరో దుకాణం వద్దకు వెళ్లడం, చెత్త డబ్బాల వద్ద వ్యర్థ పదార్థాలు తినేందుకు రోడ్డుకు అడ్డంగా అటు తిరుగు



తుండటంతో ట్రాఫిక్ సమస్య తప్పట్లేదు. శుక్రవారం సాయంత్రం ఇలా కొన్ని ఆవులు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో అటు వైపు వెళుతున్న ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రారెడ్డి సైతం వాటిని తప్పించుకుని వెళ్లేం దుకు కారును ఆపాల్సి వచ్చింది. ఆవులు రోడ్డుపై పేడ వేయడంతో పలువురు వాహన దారులు జారి పడి గాయాలైన సందర్భాలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి ఆవులు రోడ్ల పైకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత ఇసుక కోసం ఎదురు చూపులు

ప్రజాశక్తి-తాడేపల్లి

టిడిపి అధికారింలోకి వస్తే ఉచిత ఇసుక పాలసీ తీసుకువస్తామని తన మేనిఫెస్టోలో పేర్కొంది. నూతన ప్రభుత్వం ఏర్పాటైంది. సిఎం, మంత్రుల కొలువుదీరారు. ఉచిత ఇసుక పాలసీ కోసం భవన నిర్మాణదారులతో పాటు నిర్మాణ కార్మికులు కూడా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నూతన ఇసుక టెండర్ విధానాన్ని వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చింది. రాష్ట్రాన్ని మూడు భాగాలు చేసి రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా మూడు విభాగాలుగా విభజించి జయప్రకాష్ పవర్ (జెపి వెంచర్స్) సింగిల్ టెండర్ విధానంలో నడిపారు. అప్పటి దాకా ఉన్న ఇసుక ధరలు ఈ విధానంతో ఆమాంతంగా ఒక్కసారిగా పెరిగిపోయాయి. వెయ్యి రూపాయలకు అమ్మిన ట్రాక్టర్ ఇసుక రూ.4 నుంచి 5 వేలకు విక్రయించారు. ఐదు వేలు అమ్మిన పది టైర్ల లారీ ఇసుక రూ.20 నుంచి 25 వేలు ధర పలికింది. అది కూడా అడిగిన వెంటనే ఇసుక వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వీటికి మరో రూ.5 వేలు అదనంగా చెల్లించి బ్లాక్ మార్కెట్లో తెప్పించుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. పెరిగిన ధరలతో పాటు సకాలంలో ఇసుక దొరక్క లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండా పోయింది. పని దినాలు తగ్గిపోయాయి. భవన యజమానులు ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు తమ నిర్మాణాలను నిలుపుదల చేసుకున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చే నెల రోజుల ముందు కూడా ఇదే విధానం కొనసాగింది. తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానం తీసుకువస్తామని టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించాయి. 2019కి ముందు టిడిపి ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చారు. కొంత కాలం డ్వాక్రా మహిళలతో దీనిని నిర్వహించారు. ఆర్థికపరమైన కొన్ని ఇబ్బందులు రావడంతో సొసైటీ ద్వారా నడిపించారు. ప్రస్తుతం కృష్ణానది నుంచి పడవల ద్వారా ఇసుక బయటకు తీసుకొచ్చి గతంలో జరిగినట్లుగానే ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొస్తారని కృష్ణా, గుంటూరు జిల్లాల పడవల యజమానులు కోరుతున్నారు. వీరంతా కలిసి అమరావతి ఇసుక పడవల యాజమాన్య సంఘంగా ఏర్పడ్డారు. ప్రకాశం బ్యారేజీ నుంచి పులిచింతల వరకు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కలిపి 400 బోట్లు ఉన్నాయి. వీటి మీద ఆధారపడి 1500 మంది జీవిస్తున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి పనుల్లేక పడవలన్నీ నదీ ఒడ్డున పాడైపోయి ఉన్నాయి. కార్మికులకు పనుల్లేక వివిధ రకాల పనులకు వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు. పడవ యజమానులు దీని మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఐదు సంవత్సరాలు వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్త ప్రభుత్వం రావడంతో మరలా వీరిలో ఆశలు చిగురించాయి. అయితే గత ప్రభుత్వంతో కుదుర్చుకున్న టెండరు అగ్రిమెంట్ మరో సంవత్సర సమయం ఉంది. అగ్రిమెంట్ ప్రకారం సంవత్సరం పాటు ఆగాల్సి వస్తుందా... లేక నూతన పాలసీని వెంటనే అమల్లోకి తెస్తారా అనేది తేలాల్సి ఉంది. ఉచిత ఇసుక పాలసీ తీసుకురావాలని సిఎం ప్రమాణ స్వీకారం రోజున అమరావతి ఇసుక పడవల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో కృష్ణానదిలో పెద్దఎత్తున పడవలతో ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారం నిర్వహించారు.



కృష్ణానదిలో పడవలతో చంద్రబాబుకు మద్దతు తెలుపుతున్న ఇసుక యజమానులు (ఫైల్)

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన వేజళ్ల వెంకట సుబ్బారావు మెమోరియల్ విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యధిక ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ నివాసంలో ఆయన అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తెనాలి పురపాలక పాఠశాలల్లో ప్రతిభ చూపి, 560 మార్కులు పైగా సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1116 చొప్పున ప్రతిభా పురస్కారాలు అందించారు. నిర్వాహకులు, ట్రస్టు కార్యదర్శి వేజళ్ల నవ్య మాట్లాడుతూ పదేళ్లుగా ట్రస్టు ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బిసి కాలనీలో వేజళ్ల వెంకట సుబ్బారావు పురపాలక ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించటం, ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలను వివరించి, ప్రజలకు గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్నామని వివరించారు. విద్యార్థి దశలోనే పుస్తక పఠనంపై ఆసక్తి కలిగిస్తూ పలు పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేసామని, విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికి తీసేందుకు పలు పోటీలు నిర్వహించి, అభినందించడం, ప్రతిభ కనపరచిన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక చేయూత వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ఫాదర్స్ డే సందర్భంగా తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా విద్యార్థులను ప్రోత్సహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఓంకార్ గ్రాఫిక్స్ ప్రసాదు, సి.ఆర్.పి శ్రీదేవి, శివప్రసాద్, భాస్కరరావు, శ్యామ్ ప్రసాదు, టి.శివప్రసాదు, శ్రీనివాసరావు, బి.శివరామ కృష్ణ, రాజేంద్ర, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న మున్సిపల్ పాఠశాలల విద్యార్థులతో ట్రస్ట్ బృందం

మల్లికా స్పైన్‌కు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు

అంతర్జాతీయ స్థాయిలో అందుకున్న డాక్టర్ నరేష్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు

మల్లికా స్పైన్ సెంటర్ డైరెక్టర్, చీఫ్ స్పైన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్‌బాబుకు అమెరికా, యూరప్‌కు చెందిన రెండు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారాలు దక్కాయి. మల్లికా స్పైన్ సెంటర్ ఇటీవల మిలాన్, ఇటలీలో జరిగిన అంతర్జాతీయ లంబార్ స్పైన్ అధ్యయన సంస్థ (ISSLS) నుండి 2024కి గాను ప్రఖ్యాత ISSLS ప్రైజ్, సాన్‌డియాగో, యూనైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో స్కోలియోసిస్ రీసెర్చ్ సొసైటీ నుండి వైట్‌క్లౌడ్ అవార్డు గెలుచుకున్నారు. చరిత్ర సృష్టించింది. 2024లో లంబార్ స్పైన్ అధ్యయన సమాజం నుంచి క్లినికల్/బయోఇంజినీరింగ్ శాస్త్రాలలో ISSLS ప్రైజ్ నెగ్గిన తాము, ఈ పరిశోధన కోసం ఇంటర్వర్టెబ్రల్ డిస్క్‌లో పోషకాలు మార్పిడిని ఎలా చేస్తాయో మొదటిసారి ప్రపంచానికి చూపించామని డాక్టర్ నరేష్‌బాబు తెలిపారు. నిల్చుని, పడుకొని ఉన్న స్థితుల్లో ఇంటర్వర్టెబ్రల్ డిస్క్ ఎలా పోషణ పొందుతుందో ఈ పరిశోధన వివరించింది. 10 ప్రఖ్యాత వెన్నెముక పరిశోధకులతో ఏర్పడిన ఒక సెలక్షన్ కమిటీ ఈ పురస్కారాన్ని అందజేస్తుంది. ISSLS వార్షిక సమావేశం సందర్భంగా మిలాన్‌లో జరిగిన సదస్సులో ఈ పురస్కారం అందించారు. ఈ అవార్డుతో పాటు 20 వేల అమెరికన్ డాలర్లను నగదు బహుమతిగా అందజేశారు. ఈ పురస్కారాన్ని గెలుచుకోవడం ద్వారా, మల్లికా స్పైన్ సెంటర్ గత 50 ఏళ్లలో ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని గెలుచుకున్న రెండవ భారతీయ స్పైన్ పరిశోధనా బృందంగా అరుదైన గుర్తింపును పొందినట్లు డాక్టర్ నరేష్‌బాబు అన్నారు. డాక్టర్ నరేష్‌బాబు మరో పరిశోధన అయిన సర్వైకల్ స్పాండిలిటిస్ యొక్క డైనమిక్ ఇవాల్యూషన్‌పై పరిశోధన సాన్‌డియాగో, యుఎస్ఎలో స్కోలియోసిస్ రీసెర్చ్ సొసైటీ యొక్క డాక్టర్ థామస్ ఇ.వైట్ క్లౌడ్ అవార్డ్‌ను గెలుచుకుంది.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు



బ్లాక్‌బెల్ట్ పరీక్షలో నెగ్గిన వారికి పత్రాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎంఎంకె ఇండోర్ స్టేడియంలో నాలుగేళ్ల నుండి కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బ్లాక్‌బెల్ట్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. చరణ్ సాయి, షరీఫ్, మణికంఠ, మహేంద్ర, మోహన్ సాయి పరీక్షలో నెగ్గి బ్లాక్‌బెల్ట్ సాధించగా వీరిని ఎంఎంఎస్ స్టేడియం ప్రతినిధులు అభినందించారని మాస్టర్ డి.ప్రభాకర్ తెలిపారు.



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో కమిటీ బృందం

విద్యార్థులకు బిజెఆర్ కమిటీ ప్రతిభా పురస్కారాలు


ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన బాబూజగ్జీవన్‌రామ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాల వేడుక ఆదివారం రాత్రి స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు మేకల సురేష్ ఆధ్వర్యంలో తెనాలి, కొల్లిపర, కొల్లూరు, అమృతలూరు, వేమూరు, చుండూరు, దుగ్గిరాల, చేబ్రోలు మండలాల స్థాయిలో పదో తరగతిలో 500కు పైబడి మార్కులు సాధించిన మాదిగ సామాజిక తరగతికి చెందిన విద్యార్థులను అభినందించారు. ఎంపిక చేసిన 30 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు, కాలేజీ బ్యాగ్, వాటర్ బాటిల్ అందించారు. వారిని అభినందిస్తూ ప్రశంస పత్రాలనూ అందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పదో తరగతి తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగిన కోర్సుల వివరాలను, పోటీ పరీక్షలకు సిద్ధపడే విధానాన్ని వివరించారు. సంస్థ ద్వారా విద్యార్థులను ప్రోత్సహించేందుకు భవిష్యత్తులోనూ కార్యక్రమాలు కొనసాగిస్తామని సురేష్ చెప్పారు. కార్యక్రమంలో పి.జోసెఫ్ రత్నాకర్, అత్తోట శరత్, నలుకుర్తి రమేష్, శివపసాద్, శరత్, ఉపాధ్యాయులు సుబ్బారావు, పిఇటి విజయ్ కుమార్, న్యాయవాది ఎస్.మురళీధర్, కె.బోసుబాబు పాల్గొన్నారు.

సాహితీరత్న పూర్ణ ప్రజ్ఞాచారికి సత్కారం

ప్రజాశక్తి - తెనాలి

మండల పరిధిలో కొలకలూరుకు చెందిన సాహితీ రత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారిని పట్టణానికి చెందిన ప్రముఖ సేవా సంస్థ బి.జె.ఆర్. కమిటీ సత్కరించింది. ప్రజ్ఞాచారి ఇటీవల తెలుగు సాంస్కృతిక సాహితీ సేవా సంస్థ ద్వారా హైదారాబాద్ లో గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భాన్ని, అలాగే ఏలూరు అంతర్జాతీయ పద్య కవి సమ్మేళనంలో స్వర్ణ కంకణ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారిని సత్కరించినట్లు సంస్థ అధ్యక్షులు మేకల సురేష్ చెప్పారు. కార్యక్రమంలో ఏ.పై. పీ. యస్.సుకుమార్, ఎపి యం.ఇ.ఓ.స్ కమిటీ అధ్యక్షులు ఆదూరి వెంకట రత్నం, ప్రొఫెసర్ పిజె రత్నాకర్, శివప్రసాద్, అత్తోట శరత్, మాస్ అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు పాల్గొన్నారు.



పాఠశాలల విలీనాన్ని వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - రెంటచింతల

పాఠశాలల విలీనాన్ని వెనక్కి తీసుకోవాలని మండల యుటిఎఫ్ గౌరాధ్యక్షులు డాక్టర్ చిన్నమ్మ కోరారు ఆదివారం ఆమె మాట్లాడుతూ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక విద్య తెలుగు మాధ్యమంతో ఆరో తరగతి నుంచి ఆంగ్లం,తెలుగు మాధ్యమంలో బోధన జరిగేలా మార్పులు తీసుకురావాలని ఆమె కోరారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం జీవో 117 ను రద్దు చేయాలని కోరారు.

'స్పందన' ఇకపై 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

ప్రజాశక్తి - రెంటచింతల

గత ప్రభుత్వ హయాంలో నిర్వ హించే ప్రతి సోమవారం 'స్పందన 'కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పేరును కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందని ఆర్ఐ దాసరి కాంతారావు తెలిపారు. ఇకపై దీని పేరును 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'గా కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.



ఆంజనేయులును సత్కరిస్తున్న కడియాల రమేష్ తదితరులు

యలమంద పంచాయతి ఇన్‌ఛార్జిగా ఆంజనేయులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం యల్లమంద గ్రామ పంచాయతి ఇన్‌చార్జిగా టిడిపి సీనియర్ నాయకులు యర్రమాసు ఆంజనేయులుని ఏకగ్రీవంగా గ్రామ పెద్దలు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నరసరావుపేట పట్టణ అధ్యక్షులు కడియాల రమేష్ ఆధ్వర్యంలో ఆంజనేయులు,టిడిపి నాయకులు, అభిమానులు ఆదివారం సత్కరించారు.గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేయాలని ఆంజనేయులును టిడిపి నాయకులు కోరారు. కార్యక్రమంలో ముప్పాళ్ల నాగేశ్వరరావు, సలిశం సత్యం, మానుకొండ నిరంజన్, కడియాల తాండవ కృష్ణ, మానుకొండ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోసెఫ్ సుధీర్ బాబు

జీఓ నంబర్ 117 తక్షణమే రద్దు చేయండి

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రాథమిక పాఠశాలలను విలీనం చేస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీవో నెంబర్ 117 ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఎపిఎస్‌టిఎఫ్ ఆర్థిక కార్యదర్శి సిహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం నరసరావుపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూల్ లో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎల్.వి రామిరెడ్డి అధ్యక్షత వహించారు. జోసెఫ్ సుధీర్ బాబు మాట్లా డుతూ ఇంగ్లీషు మీడియంని సమాం తరం చేస్తూ తెలుగు మీడియాన్ని జిల్లా పరిషత్ పాఠశాలలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ పిఆర్సి నివేదిక ఆలస్యం అవుతున్న నేపథ్యంలో మధ్యంతర భృతి ప్రకటించాలని, ఉపా ధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్న బోధనేతర ,ఇతర పను లను తొలగించాలని డిమాండ్ చేశారు. అసోసియేట్ రాష్ట్ర అధ్య క్షులు ఎస్ఎం సుభాని, ఎస్టీయూ ఏపి ప్రధాన కార్యదర్శి చంద్రదీప్‌యాదవ్, నాయకులు కాసా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీలతో మరింత బాధ్యత పెరిగింది

ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అ ద్భు త విజయం, భారీ ఆధిక్యాలు తమపై బాధ్యత మరింత పెంచాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం స్థానిక పండరీ పురంలోని తన నివాసంలో తాడికొండ, దెందులూరు ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, చింతమనేని ప్రభాకర్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రావణ్‌కుమార్, ప్రభాకర్ పుల్లారావుతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటిని వారిద్దరు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. శ్రావణ్‌కుమార్, ప్రభాకర్‌ను శాలు వాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుల్లారావు మాట్లాడుతూ అర్హులై న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు,స్థానిక సమస్యల పరిష్కారం విషయంలో సత్వర స్పందనే తమ



పుల్లారావును కలిసి శుభాకాంక్షలు చెబుతున్న చింతమనేని ప్రభాకర్, తెనాలి శ్రావణ్‌కుమార్

ముందున్న లక్ష్యమని చెప్పారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు మార్గదర్శకులుగా ఉండాల్సిన బాధ్యత కూడా తమపై ఉందని అన్నారు. ఈ సందర్భంగానే చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటు పల్నాడు జిల్లాకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, పలువురు అధికారులు పుల్లారావుకు శుభాకాంక్షలు తెలిపారు.

మండల కేంద్రాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభు త్వం అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ చేయడం పట్ల బిసి సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రం రొంపిచర్లలో ఆదివారం బిసి సంక్షేమ సంఘం సమావేశం జరి గింది. ఈ సమావేశంలో పాల్గొన్న బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపా ధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు మాట్లా డుతూ రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షణీయ మన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడికి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు శుభా కాంక్షలు తెలిపారు. తిమ్మరాజు మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను పట్టణాలతో పాటు మండల కేంద్రాలలో కూడా ఏర్పాటు చేయాలని కోరారు. అద్దంకి-నార్కెట్ పల్లి జాతీయ రహదారి పరిధిలో ఉన్న మం డల కేంద్రం రొంపిచర్ల కు నిత్యం భవననిర్మాణ కార్మికులు, ఇతర కూలీలు, వద్దులు పనుల నిమిత్తం చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వస్తుంటా రన్నారు. వారి ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం మండల నాయకులు భాస్కర రాజు, ఏడు కొండల రాజు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విజయం... వారికే అంకితం : ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గంలో రెండు దశాబ్దాల కలగా ఉన్న టిడిపి గెలుపు శ్రేణులలో నూతన ఉత్తేజం నింపిందని ప్రజలు ఇచ్చిన అఖండ విజయాన్ని నియోజకవర్గ ప్రజలకే అంకితం ఇస్తున్నానని, ఇది ప్రజా విజయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో టిడిపి గెలుపుతో నరసరావుపేట మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గ్రామం నుండి గోనెపూడి గ్రామం మీదుగా ఆదివారం కోటప్పకొండకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తున్న టిడిపి అభిమానులను, వృద్ధులను కలిసి ఆయన ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను గెలిపించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా నియోజకవర్గంలో నెలకొన్న సమ



పాదయాత్ర చేస్తున్న అభిమానులను అభినందించి మాట్లాడుతున్న అరవిందబాబు

స్యలు పరిష్కరిస్తామని, యువతకు ఉపాధి కల్పించే విధంగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. వైసిపి పై ప్రజలు ఎంతగా విరక్తి చెందారో, తిరుగుబాటుకు ఏ స్థాయిలో తెగించారో ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో గుర్రం పూర్ణచంద్రరావు, గట్టినేని శ్రీనివాసరావు, ఏల్చూరి శ్రీనివాసరావు టిడిపి నాయకులు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఫర్నిచర్ దొంగ మాజీ ముఖ్యమంత్రి జగన్'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

2019 ఎన్నికలలో ఓటమి అనంతరం దివంగత సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు తన వద్ద ఉన్న అసెంబ్లీ ఫర్నిచర్ తీసుకువెళ్లాలని, అవసరం లేకుంటే ఉంచుకొని డబ్బు చెల్లిస్తానని నాటి అసెంబ్లీ కార్యదర్శికి రెండు సార్లు ఉత్తరం రాస్తే దానిని రాజకీయంగా వాడుకొని అసెంబ్లీ ఫర్నీచర్ దొంగిలించారని కోడెలను మానసికంగా హింసించారని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపించారు. నరసరావుపేటలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇంట్లో ఉన్న ప్రభుత్వ ఫర్నీచర్ సరెండర్ చేయకుండా వాడుకుంటుంటే వైసిపి నేతలు నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు. కోడెల శివప్రసాద్ తప్పు చేసి చనిపోలేదని వైసిపి నేతల వేధింపులు తాళలేక పోయారన్నారు. తాడేపల్లి,లోటస్ పాండ్ ఇళ్లకు రూ 50 కోట్లు సీఎంవో ఖాతాలో నిధులతో ఫర్నిచర్,ఇతర వసతులను తన నివాసంలో అమర్చుకున్నారన్నారు. ప్రభుత్వ ఫర్నిచర్ తిరిగి అప్పగిస్తానని మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇప్పటి వరకు ప్రభుత్వానికి సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ సొమ్ముతో తన ఇంట్లోకి కొనుగోలు చేసిన ఫర్నిచర్‌ను ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు.

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మానవాళికి త్యాగనిరతిని నేర్పించిన బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుభాకాంక్షలు తెలిపారు. స్వార్థం, రాగద్వేషాలను వదిలిపెట్టి పేదలకు మంచి చేయాలన్న సూత్రమే బక్రీద్ అన్నారు. బక్రీద్ పండుగని మానవాళి అంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కుల,మత బేధాలు లేకుండా కలిసి మెలిసి ఉంటూ మెరుగైన సమాజాన్ని స్థాపించేందుకు ఈ పండగ సందర్భంగా ప్రయత్నించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న అరవిందబాబు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు సంతకంపై హర్షం

ప్రజాశక్తి-మాచర్ల

గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు (భూ హక్కుల చట్టం)ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంపై మాచర్ల టిడిపి లీగల్‌సెల్ హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపింది. నియోజకవర్గ టిడిపి లీగల్‌సెల్ అధ్యక్షులు గంగుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని న్యాయ వాదులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ చట్టం వలన ప్రజల భూములకు రక్షణ లేకుండా పోతుందని, అందుకే దీనిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ



బ్రహ్మారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న టిడిపి లీగల్‌సెల్ సభ్యులు

న్యాయవాదులకు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో న్యాయవాదులు షేక్ గాలిబ్ సాహెబ్, కెవి రంగారావు, జె.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వర్లు, కె.డేవిడ్‌రాజు, పి.అనిల్, ఎం.శ్రీనివాసరెడ్డి, వై.కృష్ణమూర్తి, వివివి పుల్లారావు, ఆచారి, బి.నరశింహారావు, షేక్ జాని, డి.రాంబాబు ఉన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

ప్రజాశక్తి - గురజాల

దళిత వర్గానికి చెందిన వంగలపూడి అనితకు రాష్ట్ర హోంశాఖా మంత్రిగా అవకాశం కల్పించడంపై గంగవరంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలో ఎస్సీ సామాజిక వర్గం అభివృద్ధికి కృషి చేసింది ఒక్క టిడిపియేనని కొనియాడారు.

ఎమ్మెల్యేను కలిసిన గురజాల ఆర్డీవో

ప్రజాశక్తి- గురజాల

గురజాల నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యేగా ఎన్నికైన యరపతినేని శ్రీనివాసరావుని ఆర్డీవో రమణ కాంత్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరులోని శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి కలిశారు.



శ్రీనివాసరావుకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్డీఓ

టిడిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని కాశిపాడు గ్రామానికి చెందిన కందుకూరి ఏడుకొండలు కుటుంబానికి పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, టిడిపి నాయకులు ఆర్థికసాయం చేశారు. మండల టిడిపి అధ్యక్షుడు రమేష్ చేతుల మీదుగా మృతుని కుటుం బానికి ఆదివారం ఈ ఆర్థిక సహాయం అందించారు. బి.రాం గోపాల్ రావు, ఎం. సత్యం, వి.అప్పారావు, జి.బాబురావు,టిడిపి నాయకులు జి. సాంబయ్య, ఎస్.సాంబశివరావు, ఎం.సంజీవరావు, ఎం.నరసయ్య, కె.వెంకటేశ్వర్లు, బుజ్జి, బాబు, మధు పాల్గొన్నారు.

మినహాయింపు గ్రామాల్లో పత్తి సాగు ప్రారంభం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని నిర్మాణం నుంచి మినహాయించిన గ్రామాల్లో పత్తి సాగు ప్రక్రియ ప్రారంభమైంది. వర్షాల నేపథ్యంలో పత్తి విత్తనాలు నాటుతున్నారు. మండల పరిధిలో 21 గ్రామాలుండగా (రెండు శివారు గ్రామాలను కలిపి) వడ్డమాను, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాలను రాజధాని నిర్మాణం నుంచి మినహాయించారు. మూడు గ్రామాలతో పాటు ల్యాండ్ పూలింగ్‌లో రాజధాని నిర్మాణానికి భూములివ్వని మెట్ట, లంక ప్రాంతాల్లో పంటల సాగు యథావిధిగా సాగుతోంది. వడ్డమానులో సుమారు రెండు వేల ఎకరాలు, హరిశ్చంద్రపురంలో రెండు వేలు, పెదపరిమిలో 6 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వడ్డమాను, పెదపరిమిలో మినుము, పత్తి, మిర్చి తదితర


వడ్డమానులో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

పంటలు సాగవుతాయి. 10 వేల ఎకరాల్లో అత్యధికంగా 5 వేల ఎకరాల్లో పత్తి సాగవుతుండగా మిగిలిన ఎకరాల్లో మిర్చి, కంది, మినుము, కూరగాయలు పండిస్తారు. కృష్ణానదీ తీర ప్రాంత గ్రామమైన హరిశ్చంద్రపురంలో వరి, అరటి, కంద, పసుపు లాంటి ఉద్యాన పంటలూ పండుతాయి. మే నెలాఖరు నుంచే రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. పొలాల్లో పత్తి కట్టెను మిషన్లతో తొలగించి దహనం చేయడం, పొలాలను శుభ్రం చేయడం, దుక్కులు, విత్తనాలు కొనుగోలు తదితర పనులు పూర్తి చేసి పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పత్తి విత్తనాలు నాటుతున్నారు. సరిపడా వర్షాలు కురిస్తే విత్తనాలు నాటడంతోపాటు ఇతర పనులూ మరింత ముమ్మరం అవుతాయని రైతులు చెబుతున్నారు.


పింఛన్లు అందచేస్తున్న అతిథులు

పేదలకు అవోపా పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో ఆదివారం అవోపా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెఫ్రాలజీ డాక్టర్ చింతా రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రతినెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పింఛన్లు ఇవ్వటం, వైద్య పరీక్షలు జరిపి మందులు ఇవ్వటం అభినందనీయమన్నారు. పెన్షనర్లకు తమ వేదాంత హాస్పిటల్‌లో ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పసుమర్తి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పేదలు బ్యాంకుల్లో అందుబాటులో వివిధ రకాల రుణాలు తీసుకొని తమ కాళ్లపై తాము నిలబడాలని అన్నారు. బ్యాంకు వారు ఇచ్చే రుణాల గురించి వివరించారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షులు తటవర్తి రాంబాబు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, ఊటుకూరి నాగేశ్వరరావు, రమణానంద్, అమరా రమేష్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఎం.సాయిరమేష్, వెంకట్రావు పాల్గొన్నారు.

శరణాలయ విద్యార్థులకు దుస్తులు, పండ్లు పంపిణీ

భారీ మెజార్టీతో లోకేష్ గెలిసిన సందర్భంగా అందించిన టిడిపి నాయకులు



ప్రజాశక్తి - మంగళగిరి

నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో అత్యధిక మేజార్టీతో గెలిచి చరిత్ర సృష్టించిన సందర్భంగా పట్టణంలోని 16 వార్డుకు చెందిన టిడిపి నాయకులు జొన్నాదుల శివశంకరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఫైన్ ఆనంద శరణాలయంలో విద్యార్థులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. శివశంకరరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని లోకేష్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.దుర్గారావు, షేక్ రియాజ్, నరేంద్ర (బాబి), జి.నాగశ్రీనివాసరావు, ఎం.కాంతారావు, బి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వరరావు, ఎం.వీరయ్య, ఆర్.పెద్దబ్బాయి, జి.ప్రకాష్, జె.సాయి, వినయ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి

టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్యను టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ ఆదవారం అబద్ధయ్య నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. నారా లోకేష్ భారీ మెజార్టీ రావడంలో కృషి చేసినందుకుగాను అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు వాకా మాధవరావు, తెలుగు యువత నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాడిబోయిన భాస్కరరావు, జి.చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

చంద్రబాబు సిఎం అవడంతోపాటు లోకేష్ ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా ఉండవల్లి సెంటర్‌కి చెందిన టిడిపి మహిళా కార్యకర్త కొమ్మూరు లక్ష్మి, కాశీవిశ్వనాథ్ దంపతులు ఆదివారం విజయవాడ వన్‌టౌన్ పాత శివాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి జ్యోతిబసు, 11వ బూత్ టిడిపి నాయకులు దేవర భార్గవ, రాము, కోటి, మౌనిక, ప్రమీల పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్

ప్రజాశక్తి - మంగళగిరి

త్యాగనిరతిని పెంపొందించే పండగ బక్రీద్ అని రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు.

బీపీ నియంత్రణలో లేకుంటే బ్రెయిన్‌స్ట్రోక్

ప్రజాశక్తి-గుంటూరు

నరాలకు సంబంధించిన సమస్యల పట్ల అవగాహనతో బ్రెయిన్‌స్ట్రోక్స్ నుంచి కాపాడుకోవచ్చని న్యూరాలజిస్ట్ డాక్టర్ కె.నీరజ తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో న్యూరాలజిస్ట్ డాక్టర్ కె.నీరజ మాట్లాడారు. నరాలకు సంబంధించిన సమస్యలపై అవగాహన, వాటి పరిష్కారాల గురించి తెలియజేశారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, రక్తపోటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని, మధుమేహ వ్యాధిగ్రస్తులు షుగర్‌లెవెల్స్‌ను నియంత్రించుకోకుంటే రెటినోపతి, కార్డియోమయోపతి, న్యూరోపతి, నెఫ్రోపతి మొదలైన సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. రక్తపోటును నియంత్రణలో ఉంచుకోకుంటే బ్రెయిన్ స్ట్రోక్‌కు దారితీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిన సందర్భాల్లో ఎంత త్వరగా న్యూరాలజిస్ట్ వద్దకు వెళితే అంత త్వరగా కోరుకునే అవకాశాలు ఉంటాయని, సాధారణంగా బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిన నాలుగు గంటలలోపు వైద్యుల వద్దకు వెళ్లగలిగితే చాలా ఉత్తమమైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ఒక్కసారి బ్రెయిన్‌స్ట్రోక్ వస్తే

ఆరోగ్యసభలో న్యూరాలజిస్ట్ డాక్టర్ కె.నీరజ


డాక్టర్ నీరజను సత్కరిస్తున్న అవగాహన సభ్యులు

జీవితాంతం వైద్యుల సలహా మేరకు మందులు వాడాలన్నారు. ఉన్నట్టుండి నడకలోగానీ, మాటలోగానీ, చూపులోగానీ తేడా గమనిస్తే అవి ఎక్కువ శాతం బ్రెయిన్‌స్ట్రోక్‌కు సంబంధించిన సంకేతాలుగా భావించి వెంటనే న్యూరాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచించారు. వెర్టిగో గురించి తెలియజేస్తూ ఈ సమస్య సాధారణంగా శరీరంలో సోడియం లోపించిన సందర్భాల్లో తలెత్తుతుందని, ఈ సమస్యతో బాధపడే వారు ఉప్పు తగ్గించి తీసుకోవాలని, మెదడుకు సంబంధించిన, కళ్లకు సంబంధించిన కొన్ని వ్యాయామాలు వైద్యుల సలహాతో చేయాలని తెలిపారు. పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడేవారు సరిగా నడవలేరని, చేతులు వణుకుతుంటాయని, ఈ సమస్యకు దాదాపు జీవితాంతం మందులను వైద్యుల సలహాతో తీసుకోవాలని తెలిపారు. దోపమిన్ ఉత్పత్తి శరీరంలో లోపించిన వారికి పార్కిన్‌సన్ సమస్య ఉత్పన్నం అవుతుందని తెలిపారు. శరీరంలో సోడియం శాతం తగ్గిన వారిలో ఫిట్స్ సమస్య వస్తుందన్నారు. ఫిట్స్‌కు సంబంధించి ప్రస్తుతం అందుబాటులో అధునాతన వైద్యం అందుబాటులో ఉందని వివరించారు. ఆహారంలో కార్బోహైడ్రేట్స్ శాతం తక్కువగా ఉండాలని 50 శాతం పండ్లు, కూరగాయలు, 25 శాతం రైస్, మిగిలిన 25శాతం ప్రోటీన్ తీసుకుంటే ఇలాంటి నరాలకు సంబంధించిన వ్యాధులు దరిచేరకుండా ఉండటానికి ఎక్కువగా అవకాశాలు ఉంటాయని వివరించారు. నిద్రలేమి, మైగ్రేన్, గురక మొదలైన వ్యాధులకు తగు సలహాలు సూచనలు చేశారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ కె.నీరజను సత్కరించారు. సభకు టి.వి.సాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ముప్పాళ్ల ప్రసాదరావు, సంస్థ సీనియర్ సభ్యులు ఆర్.రామచంద్రరావు విశ్లేషకులు పాములరెడ్డి పాల్గొన్నారు.


మనోహర్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిబాబు

మంత్రి మనోహర్‌కు మాజీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాదెండ్ల మనోహర్‌ను మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక బోస్ రోడ్‌లోని జనసేన కార్యాలయానికి వచ్చిన హరిబాబు... మనోహర్‌తో కొద్దిసేపు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర సుబ్బారావు పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌ను కలిసిన కొండలరావు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్‌డిఎ కూటమి గెలుపునకు కృషి చేసినందుకు కొండలరావును మంత్రి అభినందించడంతోపాటు జనసేన పార్టీ అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని చెప్పారు.



నూతన వస్త్రాలు, నిత్యావసర వస్తువులు ఇస్తున్న దిలీప్ రాజ

కుష్టు బాధితులకు పెన్నిమినిస్ట్రీస్ సాయం


ప్రజాశక్తి-తెనాలిరూరల్

కుష్టురోగులను ఆదుకోవడంలో ఆత్మసంతృప్తి ఉందని సినీ దర్శకుడు దిలీప్‌రాజ చెప్పారు. మండలంలోని పెదరావురు పెన్ని మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో కుష్టు రోగులకు నూతన వస్త్రాలు, నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమాన్ని పాస్టర్ ఎం.జోషి ప్రారంభించగా సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి అధ్యక్షత వహించారు. దిలీప్‌రాజ మాట్లాడుతూ అనాధలకు, కుష్టు రోగులకు, అన్నార్తులకు సహాయపడాలనే సంకల్పంతో 22 ఏళ్లగా పెన్ని మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థను కొనసాగిస్తున్నామన్నారు. సంస్థ చేస్తున్న సాయం వెనుక ఉన్నతమైన లక్ష్యం దాగుందని ప్రదీప్ దోనేపూడి చెప్పారు. కార్యక్రమంలో సినీ సహాయ దర్శకులు ఐ.విజయభాస్కర్, వెంకి, రావణ్ పాల్గొన్నారు.

కొనసాగిన ప్రజాదర్బార్

ప్రజాశక్తి-తాడేపల్లి

ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో రెండోరోజు ప్రజాదర్బార్ నిర్వహించగా జనం పెద్దఎత్తున తరలివచ్చి సమస్యలు చెప్పారు. లోకేష్ మాట్లాడుతూ ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటానని హామీనిచ్చారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.





చిత్రకళపై ఇష్టం.. విస్తర్లపై భగత్ సింగ్ చిత్రం..

ప్రజాశక్తి - మంగళగిరి

పెయింటింగ్‌పై మక్కువ పెంచుకున్న పఠాన్ జైనాబ్‌ఖాన్ విద్యార్థి దశలోనే రికార్డులు సంపాదించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యార్థి, యువతకు నిత్య చైతన్య స్ఫూర్తి అయిన భగత్‌సింగ్ చిత్రపటాన్ని ఎంచుకున్నారు. స్థానిక టిప్పల బజారులో నివాసం ఉండే జైనాబ్ ఖాన్ స్థానిక నారాయణ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నారు. చిన్నప్పటి నుండి చిత్ర కళలపై ఆసక్తి ఉన్న జైనాబ్ ఖాన్ వారం కిందట పట్టణంలోని షాదీఖానాలో 12x10 సైజులో 300 విస్తరాకులపై భగత్‌సింగ్ చిత్రపటాన్ని వేశారు. మధ్యాహ్నం 17 గంటల నుండి రాత్రి 7 గంటల వరకూ ఇందుకోసం సమయం వెచ్చించారు. ఈ చిత్రాన్ని అంతర్జాతీయ రికార్డులు ప్రకటించే ఓ సంస్థకు పరిశీలన నిమిత్తం పంపించారు. ఆర్టిస్టుగా అంచలంచెలుగా ఎదుగుతూ వరల్డ్ రికార్డ్ సాధించే ప్రయత్నంలో ఉన్నట్లు జైనాబ్‌ఖాన్ ఈ సందర్భంగా చెప్పారు. తమ కుటుంబీకులైన ఆలీబాషాఖాన్ సోదరుల అండదండలు, ప్రోత్సాహంతో తాను ఎన్నో మంచి చిత్రాలు వేస్తానని అన్నారు. చదువుల్లోనూ ఉన్నతంగా రాణించి అత్యున్నత స్థాయికి చేరాలనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

పాలస్తీనాపై దాడులను తక్షణమే ఆపాలి

అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇజ్రాయిల్ మారణహోమం - సంఘీభావ సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు


ప్రజాశక్తి-గుంటూరు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని తక్షణమే ఆపాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని యుటిఎఫ్ హాల్లో ఎస్.హనుమంత్‌రెడ్డి అధ్యక్షతన లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, విరసం నాయకులు సి.ఎస్.ఆర్.ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ వదేళ్లుగా పాలస్తీనా దేశంపైన ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణల గురించి వివరించారు. ముఖ్యంగా గత 8 నెలలుగా సాగిస్తున్న మారణహోమంలో 36 వేల మందికిపైగా మరణించారని, తాజాగా మే 26న రఫాపై జరిగిన దాడిలో 45 మంది అమాయక ప్రజలు బలయ్యారని తెలిపారు. వీరిలో 20 మంది మహిళలు, పిల్లలు కూడా ఉన్నారని ఆవేదన వెలిబుచ్చారు. అమెరికన్ సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఈ దుష్ట చర్యలు యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతి కలిగిస్తోందన్నారు. అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తూ ఇజ్రాయిల్ దాడులు సాగిస్తోందన్నారు. విరసం నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రఫా దాడులను ఖండిస్తూ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు సమ్మె చేయడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. అయితే భారతదేశంలో కూడా ఇలాంటి సంఘీభావ ర్యాలీలు ఉద్యమాలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ ఈ ఉద్యమాన్ని భవిష్యత్తులో ప్రాంతాలవారీగా విస్తరిస్తూ ప్రపంచశాంతి కోసం కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు ఎంఎ చిష్టీ, బాషా, సలీం, భారత్ బచావో నాయకులు కె.నవజ్యోతి, ఐద్వా నాయకులు అరుణ, పద్మ, యుటిఎఫ్ నాయకులు ఎం.కళాధర్, షకీలా బేగం, వి.వి.కె.సురేష్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జి.ప్రభుదాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

నిర్మాణ రంగానికి చేయూత ఇవ్వాలి



ప్రజాశక్తి-గుంటూరు : గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల నిర్మాణ రంగం ఎంతో నష్టపోయిందని, నూతన ప్రభుత్వం ఈ రంగానికి మరింత చేయూత ఇవ్వాలని నరేడ్కో ప్రతినిధుల బృందం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణను కోరారు. ఆదివారం నరేడ్కో ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారి సమస్యలను మంత్రికి దృష్టికి తీసుకొచ్చారు. అందరి సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి బదులిచ్చారు. రాజధాని నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో నరేడ్కో అధ్యక్షులు పి.నాగవంశీ, ప్రతినిధులు వి.శ్రీనాథ్, వై.దుర్గాప్రసాద్, జి.తిరుపతిరావు, ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఎన్.శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం

ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. రైతులు ఏటా ఒకే పంట కాకుండా పంట మార్పిడికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఎప్పుడూ ఒకే పంట సాగుచేయడం వల్ల దిగుబడి పెరగదన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

- అనధికారిక విత్తనాలు కొనొద్దు
- పంట మార్పిడి శ్రేయోదాయకం
- ప్రజాశక్తితో గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు





జిల్లాలో సాగు విస్తీర్ణం ఎంత?

జిల్లాలో 3.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని అంచనా. 1.60 లక్షల ఎకరాల్లో వరి, 65 వేల ఎకరాల్లో పత్తి, 50 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తారు. మరో 50 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయి.

విత్తనాల సరఫరా ఎలా ఉంది?

32 వేల క్వింటాళ్ల వరి, లక్షా 30 వేల ప్యాకెట్ల పత్తివిత్తనాలు, 7 లక్షల ప్యాకెట్ల మిర్చి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 1600 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు నిల్వలున్నాయి. వరి విత్తనాలు కిలో రూ.5కు సబ్సిడీపై అందిస్తాం.

నకిలీ విత్తనాలు అరికట్టడానికి చర్యలు?

రైతులు ఎక్కడా అనధికార వ్యక్తుల వద్ద విత్తనాలు కొనవద్దు. అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి. ఆ సందర్భంలోనూ రసీదులను తప్పని సరిగా తీసుకోవాలి. జిల్లాలో గతేడాది నకిలీ విత్తనాల బెడద రాలేదు. ప్రస్తుతం దుకాణాల్లో తనిఖీలు చేసి పరిశీలిస్తున్నాం.

తొలకరి పంటలుగా వేటిని వేయాలి?

తొలిదశలో పచ్చి రొట్ట విత్తనాలు వేయాలి. మొలిచిన మొక్కలని భూమిలో కలియదున్నాలి. దీనిద్వారా భూ సారం పెరుగుతుంది.

భూసార పరీక్షలు చేస్తున్నారా?

భూసార పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లాలో 10 వేల నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపాం. ఒక్కో రైతు భరోసా కేంద్రానికి 40 చొప్పున నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించాం. భూసార పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

పంట మార్పిడి కి సూచనలు?

ప్రతిఏటా ఒకేపంట వేయకూడదు. దీనివల్ల భూసారం దెబ్బతింటుంది. వర్షాభావాన్ని తట్టుకొనే పంటలు సాగు చేసుకోవాలి. ఈ ఏడాది ఎక్కువగా కంది, సోయాబీన్, పొగాకు పంటలు సాగు చేస్తారని అంచనా వేస్తున్నాం. ఏటా పత్తి, మిర్చి కంటే ఇతర పంటలు సాగు చేసిన వారు కూడా బాగా ఆదాయం పొందారు.

ఎరువుల నిల్వలు ఎంత ఉన్నాయి?

ప్రస్తుతం ఎరువులు పుష్కలంగా ఉన్నాయి. 25 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతున్నా జలాశయాల్లో నీరు లేకపోవడం వల్ల రైతులు సాగుకు వెనుకంజ వేస్తున్నారు. కాల్వలకు నీరు వస్తుందని హామీ ఉంటే తప్ప సాగుకు రైతులు ముందుకొచ్చే అవకాశం లేదు. కృష్ణా ఎగువ ప్రాంతాల్లో వర్షం పడి జలాశయాల్లోకి నీరు వస్తే సాగు ప్రారంభమవుతుంది.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

బక్రీద్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. బక్రీద్ సందర్భంగా ముస్లిమ్ సోదరులు నమాజ్ చదువుకునేందుకు నగరంలోని ఈద్గాలను ఎమ్మెల్యే నసీర్ ఆదివారం సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ ఈ పండుగను సోదరభావంతో జరుపుకోవాలని, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నగరంపాలెం, ఉర్దూ హైస్కూల్, ముస్లిమ్ కాలేజ్ ఈద్గాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. వేలాది మంది ముస్లిములు పాల్గొని ప్రార్థనలు చేస్తారని, వారికి అసౌకర్యం కలగకుండా చూడాలని, ఈద్గాల చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని నగర పాలక సస్థ అధికారులకు సూచించారు. ఫాగింగ్ చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు ఇఇ కోటేశ్వరరావు, ఎస్ఎస్.ఆయుబ్‌ఖాన్, రామయ్య, రెహమాన్, ముస్లిమ్ మత పెద్దలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.